సాక్షి
జయశంకర్ భూపాలపల్లి

సోమవారం | 18 | సెప్టెంబర్ | 2023



పెరిగిన ప్రాణహిత వరద

మహారాష్ట్రలో వర్షాలు కురుస్తుండడంతో కాళేశ్వరం వద్ద ప్రాణహిత నది పరవళ్లు తొక్కుతోంది.

- 8లో ▸



బరిలో దిగితే.. పతకం పక్కా..

విద్యార్థులు ఓ వైపు తరగతి గదుల్లో పుస్తకాలతో కుస్తీ పడుతూనే.. మరో వైపు మైదానంలో క్రీడల్లో రాణిస్తూ దేశానికి పేరు తీసుకొస్తున్నారు.

- 8లో ▸

గరిష్టం/కనిష్టం
31.4^0 /25.1^0

వాతావరణం

జిల్లాలో ఉదయం వాతావరణం ఆహ్లాదకరంగా ఉంటుంది. మధ్యాహ్నం సమయంలో సాధారణ పరిస్థితి ఉంటుంది. రాత్రి సమయంలో అక్కడక్కడా చిరు జల్లులు పడే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

21న డ్రైవింగ్ లైసెన్స్ మేళా



చిట్యాల: జీఎంఆర్ఎం ట్రస్టు ఆధ్వర్యంలో ఈ నెల 21న డ్రైవింగ్ లైసెన్స్ మేళా నిర్వహిస్తున్నట్లు జీఎంఆర్ఎం ట్రస్టు వైస్ చైర్మన్ గండ్ర గౌతమ్‌రెడ్డి అన్నారు. ఆదివారం మండలకేంద్రంలో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ 18 నుంచి 40 సంవత్సరాల వయస్సు గల వారు ఉచిత డ్రైవింగ్ లైసెన్స్ కోసం దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఆసక్తి గల వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాల కోసం 80083 87496, 90000 944717 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్‌కు ఇద్దరు ఎంపిక



టేకుమట్ల: జిల్లాకేంద్రంలో ఆదివారం జరిగిన జిల్లాస్థాయి అథ్లెటిక్స్‌లో మండలకేంద్రంలోని ఉన్నత పాఠశాలకు చెందిన ఇద్దరు విద్యార్థులు అత్యంత ప్రతిభ కనకబరిచి రాష్ట్రస్థాయికి ఎంపికైనట్లు వ్యాయామ ఉపాధ్యాయులు ఆనంద్ తెలిపారు. తొమ్మిదో తరగతి విద్యార్థి గణేష్ అండర్ 14 విభాగంలో లాంగ్ జంప్‌లో ద్వితీయ స్థానం, అండర్ 17 విభాగంలో జావలిన్‌త్రోలో మనీష్ తృతీయస్థానంలో నిలిచి రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్‌కి ఎంపికైనట్లు తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులను ఉపాధ్యాయులు అభినందించారు.

ఆప్ నియోజకవర్గ ప్రధాన కార్యదర్శిగా సాయి ప్రదీప్



భూపాలపల్లి అర్బన్: ఆమ్ ఆద్మీ పార్టీ భూపాలపల్లి నియోజకవర్గ ప్రధాన కార్యదర్శిగా సాయి ప్రదీప్‌రెడ్డిని నియమించినట్లు జిల్లా కన్వీనర్ నాగుల అరవింద్ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. నియోజకవర్గంలోని ప్రజా సమస్యలపై పోరాటాలు నిర్వహించేందుకు పార్టీ ఆధ్వర్యంలో అన్ని కమిటీలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు.

ఆంక్షలు లేకుండా చూడాలి

కాటారం: అడవుల్లో వెదురు పెంపకం, సేకరణపై అటవీశాఖ ఆంక్షలు లేకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని మేదరి సంఘం జిల్లా అధ్యక్షుడు గైని రమేష్ అన్నారు. కాటారం మండలకేంద్రంలో ఆదివారం విలేకర్ల సమావేశంలో గైని రమేష్ మాట్లాడారు. కులవృత్తిపై ఆధారపడి జీవించే మేదరులు వెదురును ఇతర ప్రాంతాల నుంచి అధిక ధరలకు కొనుగోలు చేయాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తంచేశారు. ధరల భారంతో కులవృత్తికి దూరం అవుతున్నారని తెలిపారు. పర్యావరణానికి ఎలాంటి హానీ తలపెట్టని వెదురు ఈ ప్రాంతంలో కనుమరుగైపోతుందన్నారు. ప్రభుత్వం అటవీశాఖ ద్వారా వెదురు ప్లాంటేషన్‌లు పెంచేలా చూడాలని కోరారు. కమ్యూనిటీహాళ్లు, కుల భవన నిర్మాణాలకు కృషి చేయాలని తెలిపారు. ప్రతి సంక్షేమ పథకంలో మేదరి కులస్తులకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా ఉపాధ్యక్షుడు రేపాల మోహన్, జిల్లా ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు రేపాల వేణుగోపాల్, యువజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి చిలువేరు శ్రీధర్, రేపాల రాజేశ్వర్, పాడి రాజేందర్, నరేందర్ పాల్గొన్నారు.

విశ్వకర్మను ఆదర్శంగా తీసుకోవాలి



ములుగు: విశ్వకర్మను ఆదర్శంగా తీసుకోవాలని జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి, సంక్షేమ అధికారి లక్ష్మణ్ అన్నారు. జిల్లాలో కేంద్రంలో సంక్షేమ భవన్‌లో ఆదివారం నిర్వహించిన విశ్వకర్మ జయంతికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో విశ్వకర్మ జిల్లా అధ్యక్షుడు ఎల్కతుర్తి రాజన్న, అమృతచారి, కొండపర్తి రాజయ్యచారి, వేలిసోజు ప్రేమసాగర్, మందోజు పరిపూర్ణాచారి, రమణ, నారాయణ, సకల ఉద్యోగ సంఘాల గౌరవ అధ్యక్షుడు నాగేశ్వర్‌రావు, సరిత, జీవన్, విజయ్, వెంకటలక్ష్మి, సిబ్బంది పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ పల్లా రాజేశ్వర్‌రెడ్డి



ఎమ్మెల్సీకి పరేడ్‌లో వందనం సమర్పిస్తున్న పోలీసులు



సంక్షేమం, అభివృద్ధిలో స్ఫూర్తిదాయకం

- ఎమ్మెల్సీ పల్లా రాజేశ్వర్‌రెడ్డి
- ఘనంగా జాతీయ సమైక్యతా దినోత్సవం

భూపాలపల్లి రూరల్: సంక్షేమాభివృద్ధి కార్యక్రమాల అమలులో జయశంకర్ భూపాలపల్లి జిల్లా స్ఫూర్తిదాయకంగా నిలుస్తోందని రైతు బంధు రాష్ట్ర సమన్వయ సమితి చైర్మన్, ఎమ్మెల్సీ పల్లా రాజేశ్వర్ రెడ్డి అన్నారు. ఆత్మీయ సమైక్యతా దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆదివారం కలెక్టరేట్‌లో కలెక్టర్ భవేష్‌మిశ్రా, ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డితో కలిసి జాతీయజెండాను ఆవిష్కరించారు. అనంతరం పల్లా రాజేశ్వర్‌రెడ్డి మాట్లాడారు. అభివృద్ధిలో జిల్లా ముందుకు దూసుకెళ్తుందన్నారు. పంచాయతీరాజ్, ఇంజనీరింగ్ శాఖ కార్యాలయాలు ఏర్పాటు చేసుకున్నామని తెలిపారు. గోరికొత్తపల్లి మండలంలో నూతన తహసీల్దార్ కార్యాలయం ఇటీవలే ప్రారంభించుకొని సేవలు అందిస్తున్నట్లు చెప్పారు. చాలాకాలం నుంచి వేసిచూసిన రైతులకు పోడు పట్టాలు అందించినట్లు తెలిపారు. మారుమూల ప్రాంతమైన భూపాలపల్లి జిల్లా అవుతుందని.. మెడికల్ కళాశాల ఏర్పాటు అవుతుందని ఎవరూ ఊహించలేదన్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్ దార్శనికతతో జిల్లాతోపాటు జిల్లాలో వైద్యశాల ఏర్పాటు చేసుకున్నామని ఆనందం వ్యక్తంచేశారు. త్వరలోనే ముఖ్యమంత్రి కేసీఆర్ చేతులమీదుగా సమీకృత కలెక్టర్ కార్యాలయాన్ని ప్రారంభించుకోనున్నట్లు తెలిపారు. స్వరాష్ట్రం నేడు అన్ని రంగాల్లో అద్భుతమైన అభివృద్ధిని సాధిస్తుందని గర్వంగా చెప్పారు. అనతికాలంలోనే దేశంలోనే అగ్రగామి రాష్ట్రంగా వెలుగొందుతోందని పేర్కొన్నారు. కొందరు విమోచన.. కొందరు వీలిన.. కొందరు విద్రోహ దినోత్సవమని అంటున్నారని ఇవన్నీ ఆలోచించిన తర్వాతనే జాతీయ సమైక్యత దినోత్సవం జరుపుకుంటున్నట్లు చెప్పారు. తెలంగాణ సాయుధ పోరాటంలో 1946నుంచి 1948వరకు 4వేల మంది అమరులయ్యారన్నారు. ఆనాడు దున్నేవాడికి భూమి ఇవ్వాలని, బానిసత్వం పోవాలని కలలుగని పోరాటం చేశారని అందులో కొన్ని కలలు సఫలం అయ్యాయన్నారు. దేశ నిర్మాణంలో తెలంగాణ భాగం పంచుకున్న ఈ రోజును జాతీయ సమైక్యతా దినంగా ఘనంగా జరుపుకుంటున్నామని తెలిపారు. ఆనాటి అపూర్వ ఘట్టాలు జాతి జీవనంలో నిరంతరం సజీవంగా నిలిచిపోయాయని గుర్తుచేశారు. నేటి సందర్భంలో ఆనాటి యోధుల త్యాగాలను తలుచుకోవడం మనందరి బాధ్యత అని గుర్తుచేశారు. ఆదివాసీ యోధుడు కొమురంభీం, తన అమరత్వంతో చరిత్రను వెలిగించిన దొడ్డి కొమురయ్యలతోపాటు నాటి పోరాటానికి నాయకత్వం వహించిన మహనీయులు రావి నారాయణ రెడ్డి, స్వామి రామానంద తీర్థ, భీంరెడ్డి నర్సింహారెడ్డి, వీర వనిత చాకలి ఐలమ్మ, ప్రజా ఉద్యమానికి సేనాధిపతిగా నిలిచిన ఆరుట్ల రామచంద్రారెడ్డి, ఆరుట్ల కమలాదేవి, బొమ్మగాని ధర్మభిక్షంగౌడ్, దేవులపల్లి వెంకటేశ్వర్‌రావు, బద్దం ఎల్లారెడ్డి వంటి ప్రజానేతల త్యాగాలను సగర్వంగా స్మరించుకుందామన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్పీ కరుణాకర్, అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు, అసిస్టెంట్ కలెక్టర్ ఉమాశంకర్ ప్రసాద్, జెడ్పీ చైర్‌పర్సన్ జక్కు శ్రీహర్షిణి, మున్సిపల్ చైర్‌పర్సన్ సెగ్గం వెంకటరాణి సిద్దు, వైస్ చైర్మన్ కొత్త హరిబాబు, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బుర్ర రమేష్‌గౌడ్ జిల్లాలోని వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



జెండా ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్సీ రాజేశ్వర్‌రెడ్డి

వినాయక విగ్రహాలు కొనుగోలు చేస్తున్న భక్తులు



నేటినుంచి గణపతి ఉత్సవాలు

భూపాలపల్లి అర్బన్: గణపతి నవరాత్రి ఉత్సవాలు నేటి (సోమవారం) నుంచి తొమ్మిది రోజుల పాటు జరగనున్నారు. విగ్రహాలను ప్రతిష్ఠించి ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. వినాయక చవితిని పురస్కరించుకొని జిల్లా వ్యాప్తంగా వారం రోజుల నుంచే వినాయక విగ్రహాల విక్రయాలు ప్రారంభించారు. ఆదివారం విగ్రహాలను కొనుగోలు చేసేందుకు భక్తులు అధికసంఖ్యలో తరలివచ్చారు. వినాయక విగ్రహాల ధరలు విపరీతంగా పెరిగిపోయాయి, రెండు ఫీట్ల నుంచి మొదలుకొని 10 ఫీట్ల వరకు విగ్రహాలను అమ్ముతున్నారు. వినాయక పూజలకు కావాల్సిన సామగ్రి దుకాణాలు, పూల దుకాణాలు, స్వీటుహౌస్‌లు కిటకిటలాడాయి. జిల్లా వ్యాప్తంగా పలు స్వచ్ఛంద సంస్థలు మట్టి వినాయక విగ్రహాలను పంపిణీ చేశాయి.

ఓటరు నమోదు అర్జీలు పూర్తిచేయాలి

- కలెక్టర్ భవేష్‌మిశ్రా

భూపాలపల్లి రూరల్: గడువులోగా పెండింగ్‌లో ఉన్న అర్జీలను పూర్తిచేయాలని కలెక్టర్ భవేష్‌మిశ్రా అధికారులను ఆదేశించారు. ఆదివారం రెవెన్యూ డివిజనల్ కార్యాలయంలో తహసీల్దార్లతో సమీక్ష సమావేశం నిర్వహించి కలెక్టర్ మాట్లాడారు. సెప్టెంబరు 19వరకు 18 సంవత్సరాలు నిండిన యువతీ యువకుల అర్జీలను సత్వరమే పరిగణలోకి తీసుకొని ఓటరు నమోదులో పొందుపరచాలన్నారు. ఆన్‌లైన్ ద్వారా అర్జీలు పెట్టుకున్న నూతన ఓటర్ల నమోదు వివరాలు ఎన్నికల కమిషన్ గడువు ప్రకారం ఈ నెల 19న ముగియనున్నందున అన్ని మండలాల తహసీల్దార్లు కొత్త ఓటరు నమోదు అర్జీలను త్వరితగతిన పూర్తిచేయాలని సంబంధిత తహసీల్దార్లను ఆదేశించారు. ఓటరు బదిలీ, ఓటరు నమోదు చనిపోయిన వారి పేర్లను ఓటరు జాబితా నుంచి తొలగించుటపై కలెక్టర్ సంబంధిత తహసీల్దార్లకు దిశానిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ రమాదేవి, అసిస్టెంట్ కలెక్టర్ ఉమాశంకర్ ప్రసాద్, తహసీల్దార్లు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ భవేష్‌మిశ్రా

అమరుల ఆశయ సాధనకు సీఎం కృషి

భూపాలపల్లి అర్బన్: ముఖ్యమంత్రి కేసీఆర్ సాయుధ పోరాట అమరుల ఆశయాల సాధనకు కృషి చేస్తున్నారని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బుర్ర రమేష్ తెలిపారు. జిల్లాకేంద్రంలోని గ్రంథాలయం ఆవరణలో తెలంగాణ జాతీయ సమైక్యతా దినోత్సవ వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా బుర్ర రమేష్ హాజరై తెలంగాణ అమరవీరులకు ఘనంగా నివాళులర్పించారు. అనంతరం జాతీయ జెండాను ఎగురవేశారు. ముఖ్యమంత్రి కేసీఆర్ చేస్తున్న అభివృద్ధి పథకాలను వివరించారు. అభివృద్ధి, సంక్షేమం అంటే ఏమిటో రాష్ట్రంలో ప్రతి పౌరునికీ తెలియజేసిన ఘనత మన ముఖ్యమంత్రికే దక్కుతుందన్నారు.



జాతీయ పతాకాన్ని ఆవిష్కరిస్తున్న బుర్ర రమేష్

సంక్షేమ పథకాలను వినియోగించుకోవాలి

- ఐటీడీఏ పీఓ అంకిత్
- ఘనంగా జాతీయ సమైక్యతా దినోత్సవం
- స్వాతంత్య్ర సమరయోధులకు నివాళి

ఏటూరునాగారం: సంక్షేమ పథకాలను వినియోగించుకోవాలని ఐటీడీఏ పీఓ అంకిత్ గిరిజనులకు సూచించారు. ఆదివారం జాతీయ సమైక్యతా దినోత్సవం సందర్భంగా మండల కేంద్రంలోని ఐటీడీఏ కార్యాలయం ఆవరణలో స్వాతంత్య్ర సమరయోధుల చిత్రపటాలకు, కొమురం భీం విగ్రహానికి పీఓ పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఐటీడీఏ ద్వారా అందిస్తున్న పథకాలను సమగ్రంగా పొంది ఆర్థికంగా, సామాజికంగా అభివృద్ధి చెందాలన్నారు. కార్యక్రమంలో ఏపీఓ వసంతరావు, ఎస్ఓ రాజ్‌కుమార్, అకౌంట్ అధికారి సంతోష్, డిప్యూటీ డైరెక్టర్ క్రాంతికుమార్, మేనేజర్ శ్రీనివాస్, అకౌంట్స్ మేనేజర్ నర్సింగ్, ఏసీఎంఓ రవీందర్, వాగ్య, అనిల్, జాబర్, ఎస్‌హెచ్ఎం మేనేజర్ మహేందర్ ఇతర సిబ్బంది పాల్గొన్నారు.



కొమురం భీం విగ్రహానికి నమస్కరిస్తున్న పీఓ

సాయుధ పోరాట వారసులు కమ్యూనిస్టులు



గుడిసెవాసులతో మాట్లాడుతున్న వెంకటరెడ్డి

- సీపీఎం జిల్లా కార్యదర్శి వెంకటరెడ్డి

వాజేడు: తెలంగాణ సాయుధ పోరాట వారసులు కమ్యూనిస్టులేనని సీపీఎం ములుగు జిల్లా కార్యదర్శి తుమ్మల వెంకటరెడ్డి అన్నారు. మండల పరిధిలోని మండపాక సమీపంలో కొన సాగుతున్న గుడిసె వాసుల ఇళ్ల స్థలాల కేంద్రాన్ని ఆదివారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా గుగ్గిళ్ల దేవయ్య అధ్యక్షతన ఏర్పాటు చెసిన తెలంగాణ సాయుధ పోరాట వార్షికోత్సవ సభలో మాట్లాడారు. రాష్ట్రంలో 1946 నుంచి 1951 వరకు తెలంగాణ వెట్టి చాకిరికి, భూస్వాములకు వ్యతిరేకంగా స్వచ్ఛందంగా తరలివచ్చి ప్రజలు తిరుగుబాటు చేశారన్నారు. ఆ నాడు ఆంధ్రా మహాసభ కమ్యూనిస్టు పార్టీ మాత్రమే రాష్ట్రంలో 10 లక్షల ఎకరాల భూమిని పంచిపెట్టిందన్నారు. నాలుగున్న వేల మంది అమరవీరులు రక్త తర్పణ చేసి వీర తెలంగాణ సాయుధ పోరాటాన్ని కొనసాగిస్తే కేంద్రంలోని బీజేపీ పాలకులు ఈ పోరాటాన్ని విమోచన దినంగా పేర్కొంటూ ముస్లిం రాజుకు వ్యతిరేకంగా హిందువులు చేసిన పోరాటంగా వక్రీకరిస్తున్నారన్నారు. తెలంగాణ రాష్ట్రంలో జాతీయ సమైక్యత, ప్రజల ఐక్యతను దెబ్బ తీస్తున్నారని విమర్శించారు. రాష్ట్రంలో తెలంగాణ సాయుధ పోరాటం స్ఫూర్తితో 67 కేంద్రాల్లో ఇంటి స్థలాల కోసం రాష్ట్ర ప్రభుత్వ నియంతృత్వ ధోరణికి వ్యతిరేకంగా ప్రభుత్వ భూముల ఆక్రమణ జరుగుతుందన్నారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు గ్యానం వాసు, దావూద్, కృష్ణబాబు, సౌమ్య, కుమారి, ముత్తయ్య, చిన్ని తదితరులు ఉన్నారు.

మట్టి ప్రతిమలే రక్ష

పర్యావరణాన్ని కాపాడుదాం

- పీఓపీకి బదులుగా మట్టి విగ్రహాల ప్రతిష్ఠ మేలు
- భూపాలపల్లి పట్టణంలో పంపిణీ
- విద్యార్థులకు అవగాహన కార్యక్రమాలు

భూపాలపల్లి అర్బన్: పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యత ఇస్తూ ఆధ్యాత్మిక భావాల వ్యాప్తికి కృషిచేస్తున్న వారిసంఖ్య రోజురోజుకూ పెరుగుతోంది. చవితి పండుగ నిర్వాహకుల సంఖ్య కూడా ఏటా పెరుగుతుంది. పోటీపడి సహజత్వాన్ని మరిచి రసాయనిక రంగులు, వివిధ రకాల ఆకారాల విగ్రహాలను ప్రతిష్ఠించటం మూలంగా చెరువులలోని నీరు కలుషితమవుతోంది. ఈ నేపథ్యంలో రసాయనిక విగ్రహాలతో వాటిల్లుతున్న నష్టంపై ప్రభుత్వ అధికారులు, స్వచ్ఛంద సంస్థలు అంతంత మాత్రమే అవగాహన కల్పిస్తున్నారు. తొలుత ఎవరూ ప్రకృతి గణపతులను పట్టించుకోకున్నా, రసాయన పదార్థాలతో తయారు చేసిన విగ్రహాల మూలంగా పర్యావరణ దెబ్బతింటుండడంతో కొంతమంది భక్తులు విముఖత చూపుతున్నారు. ప్రస్తుతం పర్యావరణ రహిత మట్టి విగ్రహాలను పూజించేందుకు ముందుకొస్తున్నారు. ఇందులో భాగంగా ప్రతి వీధిలోని మండపాల్లో వినాయకులు కొలువుదీరుతున్నారు. ఈ వేడుకలకు మట్టి విగ్రహాలను వాడితే సంపూర్ణ ఫలం వస్తుందని శాస్త్రాలు చెబుతున్నాయి. భూపాలపల్లి పట్టణంలో సింగరేణి ఆధ్వర్యంలో మట్టి విగ్రహాల పంపిణీ మూడు రోజుల క్రితమే నిర్వహించారు. విద్యార్థులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.

మట్టి విగ్రహాలను పూజించాలి

ప్రతి ఒక్కరూ మట్టి విగ్రహాలను పూజించాలి. మండపాలలో ఏర్పాటు చేయటంతో పాటు ప్రతి ఇంటిలో నెలకొల్పి పూజలు చేసేందుకు అవగాహన కల్పించాల్సిన అవసరం ఉంది. ఇప్పటికే కొన్ని స్వచ్ఛంద సంస్థలు మట్టి విగ్రహాలను వినాయక చవితి పర్వదినం రోజు ఉచితంగా పంపిణీ చేసేందుకు ముందుకు వస్తున్నాయి. జిల్లాకేంద్రంలో కొంతమంది మట్టి విగ్రహాలను తయారు చేయగా అమ్మకాలకు సిద్ధంగా తయారుచేశారు. రసాయనిక విగ్రహాలకు దీటుగా మట్టి విగ్రహాలను అలంకరించగా కొనుగోలు చేసేందుకు సైతం పలు నిర్వాహక కమిటీలు ఆసక్తి కనబరుస్తున్నాయి.

ప్రకృతి.. దైవత్వం..

ప్రకృతిలో దైవత్వం నిండి ఉంటుంది. ప్రకృతి నుంచి వచ్చే మట్టిలో దేవుడు కొలువు ఉంటాడు. అలాంటి మట్టిని తాకినా, చేతులతో విగ్రహాన్ని చేసినా సంపూర్ణ ఆరోగ్యం సిద్ధిస్తుంది. చెరువులోని ఒండ్రుమట్టి తగిలినా శరీరం, ప్రతిమను తయారు చేసినా చేతులు ఆరోగ్యంగా మారుతాయని పర్యావరణ వేత్తలు చెబుతున్నారు. నేచర్ క్యూర్ ఆస్పత్రిలో ప్రకృతి వైద్యంలో భాగంగా మట్టితోనే చికిత్స అందిస్తుంటారని చెబుతున్నారు. మట్టితో చేసిన ప్రతిమలను చెరువుల్లో వేయటం మూలంగా భూగర్భ జాలాలు శుద్ధి అవుతాయి. మట్టి విగ్రహాలను ప్రతిష్ఠించి పూజించటం అనాదిగా వస్తున్న సంప్రదాయం. పూర్వం రోజుల్లో చెరువుల్లో దొరికే నల్లరేగడి మట్టిని విగ్రహం తయారీలో వినియోగించి అందమైన రూపంలో తయారు చేసేవారు. ఆ విగ్రహాలు సుమారు 41రోజుల వరకు నిలకడగా, ధృడంగా ఉండేవని పూర్వీకులు చెబుతున్నారు. ఊరంతా ఒకే మట్టి ప్రతిమను ప్రతిష్ఠించి 9 రోజుల పాటు పూజలు చేసేవారని పెద్దలు వివరిస్తున్నారు. ప్రకృతి హితంగా ఊరూరా మట్టి విగ్రహాలను నిలిపి చక్కని పర్యావరణాన్ని భావితరాలకు అందించాల్సిన అవసరం మనందరిపై ఉంది.





మట్టి విగ్రహాలు పంపిణీ చేస్తున్న సొసైటీ సభ్యులు



పంపిణీ చేస్తున్న సింగరేణి అధికారులు..

ఆరేళ్లుగా మట్టి వినాయకుడిని ప్రతిష్ఠిస్తున్నాం..



జిల్లాకేంద్రంలోని శ్రీ కన్యకాపరమేశ్వరి ఆలయంలో ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ప్రతి ఏడాది మట్టి వినాయక విగ్రహాన్ని ప్రతిష్ఠిస్తున్నాం. పర్యావరణ రక్షణ కోసం ఆలయంలో ఆరేళ్లుగా మట్టి ప్రతిమలనే నెలకోల్పుతున్నాం. 12ఏళ్లుగా జిల్లా కేంద్రంలో ప్రతి ఏడాది మట్టి వినాయక విగ్రహాలను పంపిణీచేస్తూ పర్యావరణ పరిరక్షణకు దోహదపడుతున్నాం. ప్రతిఒక్కరూ రసాయనాలతో తయారుచేసిన విగ్రహాలకు బదులుగా మట్టి విగ్రహాలను ప్రతిష్ఠించాలి.

- లంకెలపల్లి రమేష్, భూపాలపల్లి

గుడుంబా స్థావరాలపై పోలీస్ శాఖ దాడులు

వెంకటాపురం(కె): మండలపరిధిలోని బెస్తగూడెం గ్రామంలో గుడుంబా స్థావరాలపై వెంకటాపురం సీఐ బండారి కుమార్ ఆధ్వర్యంలో పోలీసులు ఆదివారం దాడులు చేశారు. వెంకటాపురం ఎస్సై అశోక్ తెలిపిన వివరాల ప్రకారం.. బెస్తగూడెం గ్రామంలో గుడుంబా తయారు చేస్తున్నారనే విశ్వసనీయ సమాచారం మేరకు ఉన్నతాధికారుల ఆదేశాలతో సిబ్బందితో కలిసి దాడులు నిర్వహించినట్లు తెలిపారు. ఈ దాడుల్లో సుమారు 1500లీటర్ల బెల్లం పానకం, 30లీటర్ల గుడుంబా, గుడుంబా తయారీకి ఉపయోగించే వస్తువులు, పదార్థాలను ధ్వంసం చేసినట్లు తెలిపారు. బెస్తగూడెం గ్రామానికి చెందిన జాడి సమ్మక్క, ముత్తమ్మ, నాగరాజు, నర్సింహారావు, వెంకటేష్, నాగేశ్వరావు, నాగేశ్వరావుల వద్ద నుంచి గుడుంబా స్వాధీనం చేసుకుని కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా సీఐ బండారి కుమార్ మాట్లాడుతూ గుడుంబా తయారు చేసినా.. విక్రయించినా.. చట్ట ప్రకారం కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. కేసుల బారిన పడి భవిష్యత్‌ను నాశనం చేసుకోవద్దని సూచించారు.



దాడుల్లో పాల్గొన్న పోలీసులు

వానరానికి అంత్యక్రియలు



కోతికి అంత్యక్రియలు నిర్వహిస్తున్న గ్రామస్తులు

గూడూరు: మహబూబాబాద్ జిల్లా గూడూరు మండలం గుండెంగ ఎస్సీ కాలనీలో ఆదివారం మృతిచెందిన వానరానికి(కోతి) స్థానికులు అంత్యక్రియలు నిర్వహించారు. నిత్యం ఉదయం, సాయంత్రం కోతులు కాలనీలో సంచరిస్తూ ఉంటాయి. ఈ క్రమంలో ఉదయం ఓ కోతి చనిపోయి పడి ఉంది. గమనించి స్థానికులు ఒకరు గ్రామానికి చెందిన వాట్సాప్ గ్రూప్‌లో ఫొటో పోస్ట్ చేయడంతో.. అందరూ అక్కడికి చేరుకున్నారు. వానరాన్ని ఆంజనేయుడిగా భావించి డప్పు చప్పుళ్లతో అంత్యక్రియలు నిర్వహించారు.

మైనంతో బుల్లి గణపయ్య



మైనంతో తయారు చేసిన సూక్ష్మ గణపతి



కళాకారుడు జయకుమార్

నర్సంపేట: నర్సంపేట పట్టణానికి చెందిన సూక్ష్మ కళాకారుడు శ్రీరామోజు జయకుమార్ గణపతి దీక్షలో ఉండి వినాయక చవితి సందర్భంగా మైనంతో మహా గణనాథుడిని తయారు చేశాడు. ఒక ఇంచు కన్నా తక్కువ పరిమాణంలో మైనంతో తీర్చిదిద్దాడు. పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతీ సంవత్సరం విభిన్న గణపతులను తయారు చేస్తున్నట్లు జయకుమార్ తెలిపారు.

బరిలో దిగితే.. పతకం పక్కా..

- క్రీడల్లో రాణిస్తున్న గిరిజన పాఠశాల విద్యార్థినులు
- జాతీయ, రాష్ట్ర స్థాయి పోటీల్లో ప్రతిభ
- ప్రోత్సహిస్తే మరింత సత్తా చాటుతామంటున్న బాలికలు



కబడ్డీ ఆడుతున్న విద్యార్థినులు(ఫైల్)

కాటారం: ప్రస్తుత కాలంలో చదువుతో పాటు క్రీడలకూ అత్యంత ప్రాధాన్యం ఉంది. ఓ వైపు తరగతి గదుల్లో పుస్తకాలతో కుస్తీ పడుతూనే.. మరో వైపు మైదానంలో క్రీడల్లో రాణిస్తూ దేశానికి పేరు తీసుకొస్తున్నారు. గ్రామస్థాయి నుంచి.. అంతర్జాతీయ స్థాయి వరకు.. వివిధ క్రీడల్లో పాల్గొన్న ఎందరో విద్యార్థులు పతకాలు సాధిస్తూ దేశ కీర్తిని విశ్వవ్యాప్తం చేస్తున్నారు. ఫలితంగా వీరిని ఆదర్శంగా తీసుకున్న మరికొందరు విద్యార్థులు క్రీడలపై ఆసక్తి పెంపొందించుకుంటూ ముందుకెళ్తున్నారు. ఇందులో భాగంగా ప్రభుత్వ గిరిజన ఆశ్రమ పాఠశాలలు కూడా క్రీడలకు నిలయాలుగా మారుతున్నాయి. మండలంలోని మేడిపల్లి గిరిజన ఆశ్రమ పాఠశాల విద్యార్థినులు చదువుతో పాటు క్రీడల్లో రాణిస్తూ అందరి మన్ననలు పొందుతున్నారు. పాఠశాల వరకే పరిమితం కాకుండా జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయి క్రీడల్లో రాణిస్తున్నారు.

రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీల్లో ప్రతిభ..

పాఠశాలలోని సుమారు 60 మంది విద్యార్థినులు కబడ్డీ, ఖోఖో, అథ్లెటిక్స్‌లో ప్రతిభ కనబరుస్తున్నారు. గతేడాది కాలంగా పలు ప్రాంతాల్లో జరిగిన జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీల్లో రాణిస్తూ పాఠశాల ప్రత్యేకతను చాటుతున్నారు. గత డిసెంబర్‌లో ఏటూరునాగారం ఐటీడీఏ ఆధ్వర్యంలో నిర్వహించిన జోనల్, రాష్ట్ర స్థాయి, భద్రాచలంలోని కిన్నెరసాని వద్ద జరిగిన ఇంటర్ సొసైటీ గిరిజన విద్యార్థుల క్రీడల్లో ప్రతిభ కనబరిచారు. అండర్ -14, అండర్-17 బాలికల విభాగంలో పలు పతకాలు కైవసం చేసుకున్నారు. ఖోఖో పోటీల్లో రాష్ట్ర స్థాయికి ఎంపికవడంతో పాటు ఇంటర్‌సొసైటీ క్రీడల్లో ఓవరాల్ విభాగంలో రెండో స్థానంలో నిలిచారు. ఇద్దరు విద్యార్థినులు అండర్ -14 రాష్ట్ర స్థాయి జట్టులో స్థానం సాధించారు. అంతేకాకుండా గతంలో జిల్లా అథ్లెటిక్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన క్రీడల్లో సుమారు 40 మంది విద్యార్థినులు రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు హెచ్‌ఎం రవిశంకర్, పీఈటీ వీరన్న తెలిపారు. షటిల్ బ్యాడ్మింటన్, ఆర్చరీ, జావెలిన్‌త్రో, షాట్‌పుట్, హ్యాండ్‌బాల్, లాంగ్‌జంప్ క్రీడల్లో కూడా విద్యార్థినులు ముందంజలో నిలుస్తున్నారు.

ప్రోత్సహిస్తే మరింత ముందుకు..

అధికారులు, ప్రజాప్రతినిధులు ప్రోత్సాహం అందిస్తే క్రీడల్లో మరింత రాణిస్తామని పలువురు విద్యార్థినులు పేర్కొంటున్నారు. పాఠశాలలో ఉన్న కొంత మేర సౌకర్యాలు, సామగ్రితో నిత్యం ప్రాక్టీస్ చేస్తున్నామని వారు తెలిపారు. తమకు కావాల్సిన సామగ్రి అందించి సహకరిస్తే ముందుకెళ్తామంటున్నారు. ఆర్థికంగా అంతంత మాత్రంగానే ఉండడంతో పోటీల్లో పాల్గొనడానికి ఇతర ప్రాంతాలకు వెళ్లాల్సి సమయంలో ఇబ్బందులు తలెత్తుతున్నట్లు వారు ఆవేదన వ్యక్తం చేశారు.

ఉపాధ్యాయుల ప్రోత్సాహం మరువలేనిది



మా ప్రధానోపాధ్యాయుడు, పీఈటీ.. క్రీడల్లో అందజేస్తున్న ప్రోత్సాహం మరువలేనిది. వారి ప్రోత్సాహంతో మరింత ముందుకెళ్తా. భవిష్యత్‌లో ఉన్నత స్థాయిలో పతకాలు సాధిస్తా.

- అపర్ణ, విద్యార్థిని

జాతీయ స్థాయిలో రాణించడమే లక్ష్యం



ఆర్చరీ విభాగంలో జిల్లా స్థాయిలో ప్రతిభ కనబర్చి నేషనల్ మీట్‌కు ఎంపికయ్యా. ఇదే ప్రతిభ కనబరిచి జాతీయ స్థాయిలో కూడా రాణించాలన్నదే నా లక్ష్యం. ఇందుకోసం నిరంతరం ప్రాక్టీస్ చేస్తున్న. కొన్ని అసౌకర్యాలతో ఇబ్బంది కలుగుతోంది. అయినా జాతీయ స్థాయిలో రాణిస్తాననే నమ్మకం ఉంది.

- వరలక్ష్మి, విద్యార్థిని

విద్యార్థులకు నిరంతర శిక్షణ



చదువుతో పాటు క్రీడల్లో రాణించేలా విద్యార్థినులను తీర్చిదిద్దుతున్నాం. రోజు శిక్షణ అందజేస్తున్నాం. పీఈటీ, ఉపాధ్యాయులు సహకారంతో విద్యార్థినులు రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీల్లో ప్రతిభ చాటుతున్నారు. వారిని మరింత ముందుకు తీసుకెళ్లేలా చర్యలు తీసుకుంటాం. అధికారులు, ప్రజాప్రతినిధులు సహకరిస్తే విద్యార్థులు మరింత ముందుకెళ్లే అవకాశం ఉంది.

- రవిశంకర్, హెచ్‌ఎం, గిరిజన ఆశ్రమ పాఠశాల

సూక్ష్మ కళ ద్వారా గణపతి ఆకృతులు..

- అబ్బురపరుస్తున్న రజనీకాంత్ కళా నైపుణ్యం



చాక్‌పీస్‌పై రూపొందించిన సూక్ష్మ గణపతులు

కాటారం: చాక్‌పీస్‌లు, పెన్సిల్ గ్రాఫైట్‌లపై అతిసూక్ష్మ ఆకృతులు రూపొందించి అబ్బురపరుస్తున్నారు ఓ ఆర్ట్ ఉపాధ్యాయుడు. సందర్భానికి అనుగుణంగా.. కార్యక్రమ విశిష్టతను తెలియజేసేలా చిన్న ఆకృతులు తయారు చేసి కళానైపుణ్యం చాటుకుంటున్నారు మండల కేంద్రంలోని గిరిజన సంక్షేమ గురుకుల బాలుర పాఠశాల ఆర్ట్ ఉపాధ్యాయుడు ఆడెపు రజనీకాంత్. గణపతి నవరాత్రి ఉత్సవాల సందర్భంగా చాక్‌పీస్‌పై పది మిల్లీమీటర్ల ఎత్తు, ఆరు మిల్లీమీటర్ల వెడల్పు ఉన్న గణపతి నమూనాను తయారు చేశారు. గుండు పిన్ను సాయంతో మూడు గంటలు శ్రమించి ఈ ఆకృతిని రూపొందించారు. అలాగే, పెన్సిల్ గ్రాఫైట్‌పై 1.8 మిల్లీమీటర్ల ఎత్తు, 1.2 మిల్లీమీటర్ల వెడల్పు ఉన్న బుజ్జి గణపతిని, మూడు సెంటీమీటర్ల ఎత్తున్న చెడు వినకు.. చెడు చూడకు.. చెడు మాట్లాడకు అనే రూపంలో గణపతి ఆకృతులను తయారు చేశారు. నాలుగు గంటలు శ్రమించి 3.5 సెంటీమీటర్ల ఎత్తున్న నిల్చున్న గణనాథుడి విగ్రహాలను ప్లాస్టర్ ఆఫ్ పారిస్‌పై చెక్కి ప్రజలకు గణపతి నవరాత్రి ఉత్సవాల శుభాకాంక్షలు తెలిపారు. రజనీకాంత్ గతంలో పెన్సిల్ గ్రాఫైట్‌పై అతి చిన్న గణనాథుడి ప్రతిమ చెక్కి బుక్ ఆఫ్ స్టేట్ రికార్డ్, తెలుగుబుక్ ఆఫ్ రికార్డు, తెలంగాణ బుక్ ఆఫ్ రికార్డుతో పాటు, ఆర్.హెచ్.ఆర్ వరల్డ్ రికార్డు, సృజనపుత్ర అవార్డులను సొంతం చేసుకొన్నారు. అబ్బురపరిచే కళా నైపుణ్యతను చూసి పలువురు రజనీకాంత్‌కు అభినందనలు తెలిపారు.

పెరిగిన ప్రాణహిత వరద

- ఇన్‌ఫ్లో 4.33 లక్షల క్యూసెక్కులు



కాళేశ్వరం వద్ద గోదావరి, ప్రాణహిత నదుల ఉధృతి

కాళేశ్వరం: తెలంగాణలో వర్షాలు తగ్గుముఖపట్టడంతో గోదావరికి వరద ఇన్‌ఫ్లో తగ్గింది. అయితే మహారాష్ట్రలో వర్షాలు కురుస్తుండడంతో ప్రాణహిత నది పరవళ్లు తొక్కుతోంది. ఆదివారం మహారాష్ట్రలో ఎగువన కురుస్తున్న వర్షాలతో జయశంకర్‌భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలం కాళేశ్వరం వద్ద ప్రాణహిత నది వరద గోదావరిలో కలిసి ఉధృతంగా ప్రవహిస్తున్నది. రెండు నదులు కలిసి వరద పుష్కర ఘాట్‌ను తాకుతూ దిగువకు తరలిపోతున్నది. దీంతో మేడిగడ్డలోని లక్ష్మీబ్యారేజీలో మొత్తం 85 గేట్లు ఎత్తి నీటిని దిగువకు తరలిస్తున్నారు. ప్రాణహిత ఇన్‌ఫ్లో 4,33,120 క్యూసెక్కులు ఉంది. కాగా, గోదావరికి వరద తగ్గడంతో అన్నారంలోని సరస్వతీ బ్యారేజీకి ఇన్‌ఫ్లో 11,469 క్యూసెక్కులు తరలివస్తున్నది. మొత్తం 66 గేట్లకు 3 గేట్లు ఎత్తి నీటిని దిగుకు కాళేశ్వరం వైపు తరలిస్తున్నారు. బ్యారేజీ పూర్తి సామర్థ్యం 10.87 టీఎంసీలకు ప్రస్తుతం 6.232 టీఎంసీల నీరు నిల్వ ఉంది.

ప్రియుడి ఇంటి ఎదుట ప్రియురాలి దీక్ష

- మహిళా సంఘాల మద్దతు



పెద్దకుంటపల్లి తండాలో ప్రియుడి ఇంటి ఎదుట దీక్ష చేస్తున్న కృష్ణవేణి

భూపాలపల్లి రూరల్ /భూపాలపల్లి అర్బన్:ప్రేమించి పెళ్లి చేసుకోను పొమ్మంటున్నాడని, తనకు ప్రియుడితో పెళ్లి చేసి న్యాయం చేయాలని కోరుతూ మండలంలోని వేశాలపల్లి శివారు పెద్దకుంటపల్లి తండాకు చెందిన గుగులోత్ కృష్ణవేణి ప్రియుడి ఇంటి ఎదుట దీక్ష చేపట్టిన సంఘటన ఆదివారం చోటు చేసుకుంది. భూపాలపల్లి మున్సిపల్ పరిధిలోని పెద్దకుంటపల్లి తండాకు చెందిన కృష్ణవేణి డిగ్రీ వరకు చదువుకుంది. ఈ క్రమంలో అదే గ్రామానికి చెందిన భూక్య జంపయ్యతో కృష్ణవేణి ప్రేమలో పడింది. రెండేళ్ల క్రితం జంపయ్య తనకు మాయ మాటలు చెప్పి వివాహం చేసుకుంటానని నమ్మబలికి తనను వంచించాడని విలేకరులతో రోదిస్తూ తెలిపింది. రెండేళ్ల నుంచి జంపయ్య వేరే అమ్మాయితో వివాహం నిశ్చయించుకొని ఎంగేజ్‌మెంట్ చేసుకున్నాడు. తనకు న్యాయం చేయాలంటూ పోలీస్‌స్టేషన్ కూడా వెళ్లినట్లు తెలిపింది. పెద్దమనుషుల సమక్షంలో పంచాయితీ నిర్వహించి పెద్దలు పెళ్లి చేసుకోవాలని చెప్పినప్పటికీ జంపయ్య ముఖం చాటేశాడని పేర్కొంది. భూపాలపల్లి సీఐ నేతృత్వంలో పోలీసులు కౌన్సెలింగ్ చేసి వివాహం చేసుకోవాలని జంపయ్యకు చెప్పినప్పటికీ వినకుండా తనపై దాడి చేశాడని కృష్ణవేణి తెలిపింది. జంపయ్యతోనే నాకు వివాహం జరిపించాలని ప్రియుడి ఇంటి ఎదుట కుటుంబ సభ్యులతో కలిసి నిరసన దీక్ష చేసినట్లు తెలిపింది. కృష్ణవేణికి మహిళా సంఘాలు సంఘీభావం తెలిపాయి. కృష్ణవేణిని వివాహం చేసుకోవాలని లేనిపక్షంలో మహిళా సంఘాల ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని మహిళా సంఘాల నాయకురాళ్లు జంపయ్య కుటుంబ సభ్యులను హెచ్చరించారు.

ధర్మ పరిరక్షణ కోసమే సనాతన ధర్మం

- కేంద్ర విద్యాశాఖ సహాయ మంత్రి రాజ్‌కుమార్ రంజన్‌సింగ్
- హనుమకొండ వేయిస్తంభాల దేవాలయం సందర్శన



కేంద్ర సహాయమంత్రికి మహదాశీర్వచనం అందజేస్తున్న అర్చకులు

హన్మకొండ కల్చరల్: హిందూ దేవాలయాల్లో ధర్మ పరిరక్షణ కోసం సనాతన ధర్మాన్ని అనుసరించి కార్యక్రమాలు నిర్వహించుకోవాలని కేంద్ర విద్యాశాఖ సహాయ మంత్రి రాజ్‌కుమార్ రంజన్‌సింగ్ అన్నారు. ఆదివారం హనుమకొండలోని శ్రీరుద్రేశ్వరస్వామి వారి వేయి స్తంభాల దేవాలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆలయ ఈఓ వెంకటయ్య, ప్రధానార్చకులు గంగు ఉపేంద్రశర్మ.. కేంద్ర సహాయ మంత్రిని ఆలయ మర్యాదలతో ఘనంగా స్వాగతించారు. మంత్రి స్వామివారికి అభిషేకం, పూజలు నిర్వహించారు. అనంతరం అర్చకులు తీర్థప్రసాదాలు, స్వామివారి శేష వస్త్రాలు, మహదాశీర్వచనం అందజేశారు. ప్రధాని మోదీ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని స్వామివారికి ప్రత్యేక పూజలు చేసినట్లు మంత్రి తెలిపారు.

నల్లబెల్లం పట్టివేత

- 50 కిలోల పటిక, 20 లీటర్ల గుడుంబా స్వాధీనం



పట్టుకున్న నల్లబెల్లం బస్తాలను చూపిస్తున్న డీటీఎఫ్ సీఐ కృష్ణ

మహబూబాబాద్ రూరల్ : జిల్లాలోని సీరోలు మండలం కొత్తతండా సమీపంలో 23 బస్తాల నల్ల బెల్లం, 50 కిలోల పటిక, 20 లీటర్ల గుడుంబాను పట్టుకున్నామని ఎక్సైజ్ శాఖ డీటీఎఫ్ సీఐ బి.కృష్ణ ఆదివారం తెలిపారు. ఆంధ్రప్రదేశ్ నుంచి మహబూబాబాద్ ప్రాంతానికి నల్లబెల్లం తీసుకువస్తున్నారనే పక్కా సమాచారం మేరకు తనిఖీలు నిర్వహించగా, సీరోలు మండలం కొత్త తండ సమీపంలో అశోకా లేలెండ్ వాహనంలో 23 బస్తాల నల్లబెల్లం, 50 కిలోల పటిక, 20 లీటర్ల గుడుంబా లభించిందన్నారు. వాటిని స్వాధీనం చేసుకుని ఎక్సైజ్ స్టేషన్ తరలించామన్నారు. దీనికి సంబంధించి వాహన డ్రైవర్ సుబ్రహ్మణ్యం, సూర్యాపేటకు చెందిన తిరుపతి, కొత్త తండాకు చెందిన బిక్కులపై కేసు నమోదు చేశామన్నారు. ఈ తనిఖీల్లో డీటీఎఫ్ ఎస్సై హరీష్, సిబ్బంది వెంకన్న, నర్సింహారావు, తదితరులు పాల్గొన్నారు.

అలిగేటిలో యువకుడి గల్లంతు...?



బయ్యారం: బయ్యారం సమీపంలోని అలిగేటిలో ఓ యువకుడు గల్లంతయ్యాడు. ఈ ఘటన ఆదివారం రాత్రి చోటుచేసుకుంది. ఘటనకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. బయ్యారం గ్రామానికి చెందిన బొలగాని రమేశ్(25) ఆదివారం సాయంత్రం సమీపంలో అలిగేటి వద్దకు ద్విచక్రవాహనంపై వెళ్లాడు. బ్రిడ్జి వద్ద వాహనం నిలిపి అందులో సెల్‌ఫోన్ ఉంచి నీటిలో దిగినట్లు అక్కడ ఉన్న ఆనవాళ్లను బట్టి తెలుస్తోంది. రమేశ్ కోసం గాలించినప్పటికి చీకటి కావడంతో ఆచూకీ లభ్యం కాలేదు. సంఘటనా స్థలాన్ని ఎస్సై ఉపేందర్ పరిశీలించారు.

మనస్తాపంతో వ్యక్తి ఆత్మహత్య



కొంరయ్య(ఫైల్)

నల్లబెల్లి: అనారోగ్యంతో బాధపడుతున్న ఓ వ్యక్తి.. మనస్తాపానికి గురై పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన ఆదివారం చోటు చేసుకుంది. ఎస్సై నైనాల నగేష్ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని గుండ్లపహాడ్ గొల్లపల్లికి చెందిన కోల కొంరయ్య(48) వ్యవసాయం చేస్తూ జీవనం కొనసాగిస్తున్నాడు. గత ఆరేళ్లుగా టీబీ, దమ్ము వ్యాధితో అనారోగ్యానికి గురయ్యాడు. అప్పటి నుంచి చికిత్స తీసుకుంటున్నాడు. అయినా వ్యాధి నయం కాకపోవడంతో తాగుడుకు బానిసయ్యాడు. శనివారం తీవ్రంగా దమ్ము రావడంతో మనస్తాపానికి గురై ఇంటి ఎదుట ఉన్న పత్తి చేనులోకి వెళ్లి పురుగుల మందు తాగి ఆత్మహత్యయత్నానికి పాల్పడ్డాడు. గమనించిన కుటుంబ సభ్యులు నర్సంపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా అక్కడి వైద్యుల సూచనల మేరకు ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. మృతుడికి భార్య లక్ష్మి, ముగ్గురు కుమారులు ఉన్నారు. మృతుడి కుమారుడు రాజ్‌కుమార్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

ఉరివేసుకుని వ్యక్తి..

కురవి: భార్య కాపురానికి రావడం లేదని జీవితంపై విరక్తి చెంది జాటోత్ అశోక్ (32) ఇంట్లో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలోని రాజోలు శివారు హరిదాసు తండాలో ఆదివారం చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి..తండాకు చెందిన జాటోత్ అశోక్‌కు వివాహం కాగా భార్య నిఖిత గత రెండేళ్ల నుంచి పిల్లలతో కలిసి తల్లిగారింటి వద్ద ఉంటోంది. భార్య రావడంలేదని మనస్తాపానికి గురై తన ఇంట్లో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. తండాకు చెందిన ఓ మహిళ కిటికిలోంచి తాడుకు వేలాడుతూ అశోక్ కనిపించడంతో వెంటనే తండావాసులకు విషయాన్ని వివరించింది. వారు వెంటనే పోలీసులకు సమాచారం అందజేశారు. ఎస్సై గోపి తన సిబ్బందితో సంఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని కిందికి తీసి మహబూబాబాద్ జనరల్ ఆస్పత్రికి తరలించి మార్చురీలో భద్రపరిచారు. మృతుడి తల్లి నాన్న హైదరాబాద్‌లో ఉంటుందని పోలీసులు తెలిపారు.

పాకాలలో పర్యాటకుల సందడి



ఖానాపురం: పాకాలలో ఆదివారం పర్యాటకుల సందడి నెలకొంది. జిల్లాలోని పలు ప్రాంతాలతోపాటు నర్సంపేట, ఖానాపురం మండలాల ప్రజలు పాకాలలో ఉత్సాహంగా గడిపారు. పలువురు వనభోజనాలకు తరలివచ్చి కట్టమైసమ్మ వద్ద ప్రత్యేక పూజలు చేశారు. మత్తడి ప్రదేశం వద్ద జలకాలాడుతూ కేరింతలు కొట్టారు.

చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి

- వైద్యం వికటించి మృతి చెందాడని కుటుంబీకుల ఆరోపణ..
- ఆస్పత్రి ఎదుట ఆందోళన



ఆస్పత్రి ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న కుటుంబీకులు, గ్రామస్తులు

నర్సంపేట రూరల్ : చికిత్స పొందుతున్న ఓ వ్యక్తి మృతి చెందాడు. అయితే వైద్యం వికటించడంతోనే మృతి చెందాడని ఆరోపిస్తూ కుటుంబీకులు ఆస్పతి ఎదుట ఆందోళన చేపట్టారు. ఈ ఘటన ఆదివారం నర్సంపేట పట్టణంలో జరిగింది. మృతుడి బంధువుల కథనం ప్రకారం నర్సంపేట మండలం బానోజీపేటకు చెందిన బానోత్ భద్రు (50) కూలీ పనిచేసుకుంటూ జీవనం కొనసాగిస్తున్నాడు. కాగా, పది సంవత్సరాల క్రితం భద్రు భార్య మృతి చెందింది. మృతుడికి నలుగురు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. ఈ క్రమంలో నాలుగు రోజుల క్రితం ఇంటి వద్ద కాలు జారి పడడంతో భద్రుకు కుడికాలు విరిగింది. దీంతో ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం ఎంజీఎంకు రెఫర్ చేయగా వారు నర్సంపేట పట్టణంలోని న్యూ అమ్మ మల్టీస్పెషాలిటీ ఆస్పత్రికి తరలించారు. అక్కడ వైద్యులు పరీక్షించి ఆరోగ్యశ్రీ పథకంలో ఆపరేషన్ చేస్తామని అడ్మిట్ చేసుకున్నారు. అప్రూవల్ రావడంతో శనివారం మధ్యాహ్నం ఆపరేషన్ చేయగా ఆదివారం తెల్లవారుజామున మృతిచెందాడు. ఆస్పత్రి సిబ్బంది, వైద్యులు.. కుటుంబ సభ్యులకు సమాచారం అందించకుండానే అంబులెన్స్‌లో భద్రు మృతదేహాన్ని, ఆయన కుమార్తెను గ్రామానికి తరలించారు. మృతదేహాన్ని ఇంటివద్ద దింపగా గ్రామస్తులు, కుటుంబీకులు ఆశ్చర్యానికి గురయ్యారు. వెంటనే మృతదేహాన్ని ప్రత్యేక అంబులెన్స్‌లో ఆస్పత్రికి తీసుకొచ్చి వైద్యుడితో మాట్లాడడంతో నిర్లక్ష్యంగా సమాధానం చెప్పారు. దీంతో వైద్యం వికటించి మృతి చెందారంటూ ఆరోపిస్తూ మృతదేహాన్ని ఆస్పత్రి వద్ద ఉంచి నిరసన వ్యక్తం చేశారు. దీనిపై సమాచారం అందుకున్న ఎస్సై రవి ఘటనా స్థలికి చేరుకుని బంధువులను వివరాలను అడిగి తెలుసుకుని, వైద్యులతో మాట్లాడారు. దాదాపు మూడు గంటలు బంధువులు, వైద్యులతో చర్చలు జరిపించారు. చివరకు న్యాయం చేస్తామని హామీ ఇవ్వడంతో ఆందోలన కారులు శాంతించారు. ఈ ఘటనపై మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రవి తెలిపారు.

గుండెపోటుతో మృతిచెందాడు..

భద్రుకు కాలు విరగడంతో నాలుగు రోజుల క్రితం మా ఆస్పత్రిలో అడ్మిట్ అయ్యాడు. అతను పలుమార్లు గుండెపోటుకు గురయ్యాడు. దీంతో మేము ఆపరేషన్ చేయమని చెప్పాం. అయినా కుటుంబీకులు పట్టుబడడంతో ఆరోగ్య శ్రీ పథకంలో శనివారం మధ్యాహ్నం ఆపరేషన్ చేశాం. ఆదివారం తెల్లవారుజామున గుండెపోటుతో మృతి చెందాడు. విషయం కుటుంబ సభ్యులకు తెలపగా మృతదేహాన్ని ప్రత్యేక అంబులెన్స్‌లో తీసుకెళ్లారు. మళ్లీ కావాలనే ఉదయం మా ఆస్పత్రి వద్దకు తీసుకొచ్చి నిరసన వ్యక్తం చేశారు.

-విశ్వనాథ్, ఆస్పత్రి వైద్యుడు

రోడ్డు ప్రమాదంలో ఒకరి దుర్మరణం

- మరొకరికి తీవ్ర గాయాలు

భూపాలపల్లి అర్బన్: జయశంకర్ భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని పట్టణ సమీపం పరకాల-భూపాలపల్లి జాతీయ రహదారిపై ఆదివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు దుర్మరణం చెందగా, ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. సీఐ రాంనరసింహారెడ్డి కథనం ప్రకారం పట్టణ సమీపంలోని సన్‌వ్యాలీ పాఠశాల సమీపంలో ఎదురెదురుగా రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొన్నాయి. ఈ ఘటనలో బొల్లి సాయికుమార్(26) అక్కడికక్కడే మృతి చెందాడు. బెస్త ప్రవీణ్‌కు తీవ్ర గాయాలు కావడంతో వరంగల్‌కు తరలించినట్లు తెలిపారు. మృతుడు సాయికుమార్ భూపాలపల్లి ఏరియాలోని ఓపెన్ కాస్ట్-3 కాంట్రాక్ట్ కంపెనీలో పని చేస్తున్నాడు. ప్రమాదానికి సంబంధించి అర్ధరాత్రి వరకు ఎవరూ ఫిర్యాదు చేయలేదని సీఐ తెలిపారు.

సాక్షి క్లాసిఫైడ్స్

REAL ESTATE

PLOT FOR SALE

■ HMDA KUDA Approved ప్లాట్స్ ఫర్ సేల్, హైదరాబాద్, జనగాం, హన్మకొండ, యాదగిరిగుట్ట EMI బ్యాంక్ లోన్ సౌకర్యం కలదు. ఫోన్ నెం: 8184923834. [W-189175]

HOUSE FOR SALE

■ వరంగల్, మట్టెవాడలోని రేకులపల్లి వాడలో తూర్పు ముఖముతో గల పాత ఇల్లు 113 Sq. yards పక్కా రిజిస్ట్రేషన్ గలది అమ్మకమునకు కలదు. సంప్ర॥ 8331888842. [W-1229426]

షాప్ కిరాయికి ఇవ్వబడును

■ నెహ్రూ పార్క్ దగ్గర స్టేషన్ రోడ్, జనగామలో షాప్ కిరాయికి ఇవ్వబడును వెడల్పు 11 1/2 ఫీట్లు పొడవు 38 ఫీట్లు with Furnicher. Cell: 8096302961. [W-1220759]

SERVICES

CHANGE OF NAME

■ VENUVANKA NIVEDITHA (New Name), previously called Asam Neveditha (Old Name), R/o. H.No. 1-1-192/25/A Prashanth Nagar, Chaitanyapuri Colony, Waddepali (Rural) Warangal Urban dist - 506370, Telangana State, India and solemnly declare. [W-1229427]

LOANS

■ బాలాజీ లోన్స్: మార్టిగేజ్ లోన్స్, పర్సనల్ లోన్స్, బిజినెస్ లోన్స్, IT రిటర్న్స్ (GST) చేయబడును. కాకతీయ టాకీస్, వరంగల్. ప్లాట్స్ కొనుగోలుపై ఇవ్వబడును. సంప్ర: 8522825358. [WA-7223]

4 లైన్ల క్లాసిఫైడ్ ప్రకటన 260/- రూ॥ అదనపు లైను 60/- రూ॥ మాత్రమే 5% GST అదనము

WANTED

■ వరంగల్, హనుమకొండ, మహబూబాబాద్ ఉప్పలపల్లిలలో కలెక్షన్ ఏజెంట్లు కావలెను. ఆకర్షణీయమైన జీతం+ఇన్సెంటీవ్ కలదు. సంప్ర॥ 8331817736, 8179785816. [W-1229425]

■ శ్రీవైష్ణవి లేడీస్ టైలర్స్‌లో పనిచేయుటకు వర్కర్స్ కావలెను. నెహ్రూ పార్క్ దగ్గర, స్టేషన్ రోడ్, జనగామ. సెల్: 8096302961. [W-1220758]

■ Wanted MBBS / BAMS/BHMS duty doctors, B.Sc, GNM Nursing Staff X Ray Technicians and Receptionists for a Hospital at Hanamkonda. Cont: 9000282025, 9390672891. [W-1002850]

■ మీ ఇంటి వద్దనే వుండి మీ మొబైల్ ద్వారా మా కంపెనీ యొక్క Message పంపుతూ వారానికి 3500/- సంపాదించుకోండి. వాట్సాప్ చేయండి. సంప్ర. 9573633520, 9059633520. [M-1221709]

■ ప్రముఖ కంపెనీ యొక్క రికార్డ్స్ వ్రాసినందుకు వారం వారం అధిక ఆదాయం పొందండి. వివరాలకు ఫోన్ చేయండి. ఫోన్: 7730899503 [G-1122]

■ రామకృష్ణ హోం కేర్ సర్వీస్ (డీలక్స్) VJA, HYD. శ్రీమంతుల ఇళ్ళలో ముసలివారికి సేవ చేయుటకు ఇంటి/వంట పని, బేబీకేర్ కొరకు 10th P/F, 19-30 సం. వర్కర్స్ / నర్సులు కావలెను. భో+ వ+ జీ. 18 to 21 వేలు. ఏజెంట్లకు కమీషన్ 5 వేలు. ✆ 94413 84123, 94413 86123. [B-1206744]

■ బాలాజీ హోం కేర్ సర్వీస్ (డీలక్స్) VJA, HYD. శ్రీమంతుల ఇళ్ళలో ముసలివారికి సేవ చేయుటకు ఇంటి/వంట పని, బేబీకేర్ కొరకు 10th P/F, 19-30 సం. వర్కర్స్/నర్సులు కావలెను భో+ వ+ జీ. 18 to 21 వేలు. ఏజెంట్లకు కమీషన్ 5 వేలు. ✆ 94413 81678, 94413 82678 [B-1068108]

■ త్రివేణి హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్/నర్సులు కావలెను. ఫ్రీ వసతి+ భోజనం. జీతం: 18K. ఏజెంట్ కమీషన్ 3K Ph: 9848571888 [H-189332]

■ మా ఆఫీసు న్యూ ఫ్రాంచేజీ ద్వారా మీ ఖాళీ సమయంతో పార్ట్ టైమ్ / ఫుల్ టైం వర్క్ చేస్తూ 15వేలు ఆపైన సంపాదించే అవకాశం. 9177736926 [G-751693]

ఈ సెక్షన్‌లో ప్రకటనల కొరకై సంప్రదించండి

హన్మకొండ : 9010144453
వరంగల్ : 9705748198
నర్సంపేట : 9010144453
జనగామ : 9951602871
మహబూబాబాద్ : 9010144453
పరకాల : 9010299096
జయశంకర్ భూపాలపల్లి : 9705748198

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.